క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్

రామగుండం: గ్రామీణ యువత డ్రగ్స్‌కు బానిసలుగా మారి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, డ్రైవింగ్ చేసేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ అన్నారు. అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో శనివారం కార్డెన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. దేశానికి వెన్నుముక యువతేనని, ఇటీవల కాలంలో ఆధునిక పోకడలతో యువత గంజాయి, మద్యం, డ్రగ్స్‌కు బానిసలుగా మారుతున్నారన్నారు. గ్రామాలల్లోని కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని బైక్‌లను ఒక చోటికి తీసుకువచ్చి ధృవీకరణపత్రాలు పరిశీలించి, లేని వాటి యజమానులకు సూచనలు, సలహాలిచ్చారు. రామగుండం సీఐ గొర్ల అజయ్‌బాబు, అంతర్గాం ఎస్సై బోయ వెంకట్, ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి బోనాలు



పెద్దపల్లిరూరల్: పట్టణంలో ఆదివారం ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మతల్లికి బోనాలతో మొక్కులు సమర్పించారు. మహిళలు బోనాలతో పెద్దమ్మతల్లి ఆలయానికి చేరుకుని బోనం సమర్పించారు. ఎమ్మెల్యే విజయరమణారావు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు.

గోశాలకు రూ.10వేల విరాళం



నగదు అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ రమేశ్

సుల్తానాబాద్: పట్టణంలోని మార్కండేయ కాలనీలో ఉన్న శ్రీధర్మశాస్త్రగోషాల నిర్మాణం కోసం రూ.10వేల విరాళాన్ని మాజీ జెడ్పీటీసీ ఐల రమేశ్ ఆధ్వర్యంలో గోశాల చైర్మన్ సూర్యంకు అందజేశారు. ప్రధాన కార్యదర్శి మంద శ్రీనివాస్‌గౌడ్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్, మున్నూరుకాపు జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు సాదుల సుగుణాకర్, మాజీ ఎంపీటీసీ పల్లా సురేశ్, చొప్పరి సుమన్, వెంకటేశం, శ్రీకాంత్, మల్లేశం, రవి, శ్రీనివాస్, సుంక వేణు, రామచంద్రం, మధు, శ్రీను, ప్రభాకర్, ఎల్లయ్య, విద్యాసాగర్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



ఎస్సై లక్ష్మణ్

ధర్మారం: ధర్మారం ఎస్సైగా శీలం లక్ష్మణ్ ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై సత్యనారాయణ బదిలీపై రామగుండం వీఆర్‌కు బదలీపై వెళ్లగా మంచిర్యాల ఎస్సైగా పనిచేసిన లక్ష్మణ్ ధర్మారం ఎస్సైగా బాధ్యతలు తీసుకున్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని గంగారంలో గాలివానకు చెట్టువిరిగి అదే గ్రామానికి రాచకొండ సదయ్య బార్బర్‌షాపుపై పడింది. ఈ ఘటనలో షాపు పూర్తిగా ధ్వంసమైంది. ఈ విషయం మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే బాధితుడు సదయ్యకు ఆదివారం రూ.5వేలు కాంగ్రెస్ నాయకుల ద్వారా అందించారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నేదురు రమేశ్, నాయకులు సంపత్, అశోక్‌గౌడ్, ఓదెలు, వేమారెడ్డి, మధుకర్, కిరణ్, రవిందర్, శంకర్ పాల్గొన్నారు.

నేడు ఎంపీటీసీల చివరి సమావేశం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీటీసీలతో చివరి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దివ్య దర్శన్‌రావు తెలిపారు. ఎంపీపీ బాలాజీరావు, జెడ్పీటీసీ మినుపాల స్వరూపరాణి, ఎంపీటీసీలను సత్కరిస్తామని వారు తెలిపారు. ఎమ్మెల్యే విజయరమణారావు రానున్నారని, ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరు కావాలన్నారు.

చివరి సమావేశం.. ఉద్వేగ భరితం

- ఐదేళ్ల పదవీకాలం పూర్తి
- పార్టీలకతీతంగా పరస్పర సహకారంతో అభివృద్ధికి బాటలు
- సర్వసభ్య సమావేశంలో ఉద్వేగానికి లోనైన అంతర్గాం ప్రజాప్రతినిధులు



ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న మండల స్థాయి అధికారులు

రామగుండం: మరో కొన్నిరోజుల్లో మండల పరిషత్ ప్రాదేశిక సభ్యుల పదవీ కాలం ముగియనుండడంతో ఆదివారం అంతర్గాం మండల పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు గడిచిన ఐదేళ్లలో అధికారులు, ప్రజలతో కొనసాగిన అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఉద్వేగానికి లోను కాగా వైస్ ఎంపీపీ ప్రసంగిస్తున్న క్రమంలోనే కన్నీటి పర్యంతమయ్యారు. ఎంపీపీ ప్రసంగిస్తున్న క్రమంలో ఒక్క ఉదుటున వచ్చిన కన్నీటిని పంటి బిగువున పట్టుకొని మాట్లాడకుండా ఆగిపోయారు. పార్టీలకతీతంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో మండల అభివృద్ధికి బాటలు వేశామన్నారు. అంతర్గాం మండల పరిధిలో పొట్యాల, బ్రాహ్మణపల్లి, గోలివాడ, రాయదండి, ముర్మూర్ కేవలం ఐదు ఎంపీటీసీ స్థానాలుండగా అందులో రాయదండి ఎంపీటీసీ కొలిపాక శరణ్య, గోలివాడ ఎంపీటీసీ మట్ట లక్ష్మి, బ్రాహ్మణపల్లి ఎంపీటీసీ దుర్గం విజయ (ఎంపీపీ) ముగ్గురు మహిళలు.

జెడ్పీటీసీ ఎన్నికలతో ఆరంగేట్రం



ఐదేళ్ల క్రితం పోస్టల్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. జెడ్పీటీసీ ఎన్నికలతో రాజకీయ ఆరంగేట్రం చేశాను. వివిధ పార్టీలకు చెందిన వారు ఎంపీటీసీలు, సర్పంచ్‌లుగా ఎన్నికైనప్పటికీ పార్టీలకతీతంగా మండల ప్రజాప్రతినిధులందరం కుటుంబసభ్యుల్లా అభివృద్ధి విషయంలో కలిసి పనిచేశాం. రిజర్వేషన్‌తో జెడ్పీటీసీ అయ్యాను. గడిచిన ఐదేళ్లలో మండల ప్రజలు, అధికారులతో కొనసాగిన అనుబంధం జీవితంలో మర్చిపోలేనిది.

– ఆముల నారాయణ, జెడ్పీటీసీ, అంతర్గాం

భర్త ప్రోత్సాహంతో..



బ్రాహ్మణపల్లి ఎంపీటీసీ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో గృహిణిగా ఉన్న నేను నా భర్త రాజేశ్ రాజకీయాల్లోకి రావాలని ప్రోత్సహించారు. నా గెలుపునకు సర్వశక్తులు ఒడ్డి అధ్యక్ష పీఠంపై కూర్చొబెట్టారు. ఆకెనపల్లిలో కొనసాగుతున్న అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న తనను తీసుకెళ్లేందుకు వచ్చిన కొద్ది నిమిషాల్లోనే ఆయన కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రాణాలు దక్కలేదు. అధ్యక్షురాలిగా చేసిన నా భర్తను, సోదరీమణిగా అక్కున చేర్చుకున్న మండల ప్రజలను మర్చిపోలేను.

– దుర్గం విజయ, ఎంపీపీ, అంతర్గాం

రాజకీయ చరిత్ర లేకున్నా..



మాది వ్యవసాయ కుటుంబం. మాకున్న వ్యవసాయ భూములు కాళేశ్వరం పార్వతీ పంపుహౌజ్‌లో ముంపునకు గురయ్యాయి. అప్పటివరకు నా భర్తతో పాటు నను వ్యవసాయ పనులు చేసేది. అనుకోని రాజకీయ అవకాశంతో ఎంపీటీసీ జనరల్ మహిళకు రిజర్వు కావడం కలిసివచ్చింది. మండల ఎంపీపీగా ఐదేళ్లకాలం ఐదురోజులుగా గడిచిపోయింది. మేడం అంటూ కొందరు, లక్ష్మక్క అంటూ మరికొందరు పిలిచిన పిలుపులు నా జీవితంలో మరిచిపోలేను.

– మట్ట లక్ష్మి, వైస్ ఎంపీపీ, అంతర్గాం

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్‌రూరల్: మహిళలు అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో అభయ ఫౌండేషన్ హైదారాబాద్ ఆధ్వర్యంలో మూడునెలల పాటు మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ, మెహందీ తరగతులు ఇవ్వగా ఆదివారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ తరఫున కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు ఇవ్వగా ఎమ్మెల్యే చేతుల మీదుగా మహిళలకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీరావు, ఎంపీడీవో దివ్యదర్శన్, ఎంపీటీసీ పులి అనూష, మాజీ సర్పంచ్ వీరగోని సుజాత, రమేశ్, ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలచంద్ర ఉన్నారు.

చొప్పదండి ఎమ్మెల్యేకు పరామర్శ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే సత్యం కుటుంబీకులను పరామర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే సత్యం సతీమణి ఆత్మహత్యకు పాల్పడి మరణించిన విషయం తెలిసిందే. ఆదివారం ఎమ్మెల్యేను కలిసి సంతాపం తెలిపారు.

అమ్మ పేరిట ఒక మొక్క నాటండి



జ్యోతినగర్: మన్‌కీబాత్ వీక్షిస్తున్న రాంచెందర్



రామగుండం: తిలకిస్తున్న కందుల సంధ్యారాణి

రామగుండం: వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ తల్లిపేరిట ఒక మొక్క నాటాలని దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆదివారం మన్‌కీబాత్ 111వ ఎపిసోడ్‌లో భాగంగా ప్రధాని ప్రసంగాన్ని రామగుండం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి తన అనుచరులతో కలిసి తిలకించారు. దేశం కోసం వీరమరణం పొందిన వారిని, దేశ కీర్తిని పెంపొందించిన క్రీడాకారులను గుర్తు చేసుకొని వారి సేవలను కొనియాడారు.

మన్‌కీబాత్ వీక్షించిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు

జ్యోతినగర్: ప్రధాని మన్‌కీబాత్ కార్యక్రమాన్ని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచెందర్ ఆదివారం వీక్షించారు. ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్ జ్యోతిభవన్‌లో పార్టీ పార్లమెంట్ కోకన్వీనర్ గుండబోయిన లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మన్‌కీబాత్ వీక్షించారు.

పాల్గొన్న బీజేపీ నేతలు

గోదావరిఖని: ప్రధాని మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిర్వహించిన మన్‌కీబాత్‌లో స్థానిక నేతలు పాల్గొని వీక్షించారు. స్థానిక జనగామ మండలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీవీ ద్వారా వీక్షించారు. ఎస్సీమోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, జనగామ మండలం అధ్యక్షుడు గుండెబోయిన భూమయ్య పాల్గొన్నారు.

కొలనూర్ ఎంపీటీసీ..

ఓదెల: పీఎం మోదీ ప్రసంగాన్ని మండలంలోని కొలనూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ కారెంగల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం నాయకులు తిలకించారు.

సంక్షిప్త వార్తలు

నేడు సామాజిక తనిఖీ మండల సమావేశం

పాలకుర్తి: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ మండలస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఉపాధిహామీ ఏపీఎం కొమురయ్య తెలిపారు. వారం రోజులుగా ఏడాదికాలంగా నిర్వహించిన ఉపాధిహామీ పనులపై మండల పరిధిలోని 20గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం సభ్యులు సర్వే చేసి గ్రామసభలు నిర్వహించారు. తుది నివేదికను సమర్పించేందుకు మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఏడాదిగా ఉచిత మధుమేహ పరీక్షలు

పెద్దపల్లిరూరల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో ఏడాదికాలంగా ఉచితంగా మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు సాదుల వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని పలు వార్డులతో పాటు పల్లెల్లో దాదాపు 25వేలకు పైగా మందికి పరీక్షలు నిర్వహించామన్నారు.

డ్రగ్స్ ద్వారా అనేక అనర్థాలు

పెద్దపల్లిరూరల్: డ్రగ్స్ తీసుకోవడం, మత్తు పదార్థాలు తీసుకోవడంతో కలిగే అనర్థాలను వివరిస్తూ యువకులతో ప్లకార్డుల ద్వారా పోలీసులు అవగాహన కల్పించారు. పెద్దపల్లి బస్టాండ్ ప్రాంతంలో శనివారం రాత్రి గొడవపడ్డ ఐదుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో అవగాహన కల్పించినట్టు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

జూలపల్లి: మండల కేంద్రానికి చెందిన నిరుపేద గూడెల్లి సరమ్మ అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుండగా పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వల్స నీలయ్య, సంఘ సభ్యులతో కలిసి ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సరమ్మ కుటుంబానికి రూ.5,500 అందజేశారు.

పీసీసీ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలి

సుల్తానాబాద్: పీసీసీ అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ బీసీలకు సముచిత స్థానం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

భూ నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ భూనిర్వాసితుల సంఘం సమావేశంలో ఆదివారం పలు తీర్మానాలు చేశారు. భూ నిర్వాసితుల సంఘం సరిగా పని చేయకపోవడంపై కొత్త కమిటీని ఎన్నుకునేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 3వ తేదీన భూనిర్వాసితుల సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందించుకునే సమావేశంలో ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలోని భూ నిర్వాసితులు సకాలంలో హాజరు కావాలని తోట రవీందర్ ఖాజా అజీముద్దీన్, రాజయ్య, చంద్రయ్య కోరారు.

నీటిశుద్ధి ప్లాంట్ ప్రారంభం



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జీఎం సుధాకర్‌రావు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామ పరిధి ముల్కలపల్లిలో సింగరేణి సంస్థ ఆర్జీ–3 ఆధ్వర్యంలో రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి (ఆర్వో)ప్లాంట్‌ను ఆదివారం ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు ప్రారంభించారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ రాంచంద్రరెడ్డి, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, అధికారులు రాధాకృష్ణ, రఘుపతి, ముప్పిడి రవీందర్, రాజారెడ్డి, నాయకులు తీగల రాజయ్య, దశరథం తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రసాద్‌గౌడ్



రౌతు రమేశ్

రామగిరి: ఆర్జీ–3 డివిజన్ బీఎంఎస్ నూతన కార్యవర్గాన్ని శనివారం రాత్రి ఎన్నుకున్నారు. సెంటినరీకాలనీ సీఎస్‌సీవోఏ క్లబ్‌లో బీఎంఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడిగా ఆర్మాల ప్రసాద్‌గౌడ్, ఏరియా కార్యదర్శిగా రౌతు రమేశ్, సంయుక్త కార్యదర్శులుగా విద్యాసాగర్, బండారి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా గాలి వరరాజా ప్రసాద్, ఎ.వెంకటేశ్వర్లు, క్యాతం మల్లికార్జున్, ఆఫీస్ సెక్రటరీగా మామిడి స్వామిని ఎన్నుకున్నారు.

సర్కారు బడులను కాపాడుకుందాం

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా విద్యాసంవత్సరం ఆరంభంలో కొత్తగా నమోదు పెంచేలా పాటుపడుతూ సర్కారు బడులను కాపాడుకుందామని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి అన్నారు. పెద్దపల్లిలో ఉద్యోగ విరమణ పొందిన ఐదుగురు హెచ్‌ఎంలను శనివారం రాత్రి సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి గద్దె శ్రీనివాస్, నాయకులు శ్రీధర్, రాజయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖని: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 50 డివిజన్లలో అనేక సమస్యలు పరిష్కరించకుండా కార్పొరేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సిగ్గుచేటని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం గాంధీనగర్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. నాయకులు ఏడుకొండలు, దామోదర్‌రెడ్డి, రవీందర్, రాజనర్సు, స్వరాజ్యం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీఆదివరాహస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. విజయవాడకు చెందిన మువ్వగోపాల్ కల్చరల్ ఆర్ట్స్ అకాడమీ సౌజన్యంతో నృత్యోత్సవం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చి కూచిపుడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న వాళ్లకు మువ్వగోపాల కల్చరల్ అకాడమీ వారు మెమొంటో, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాదాచార్యులు, భూపెల్లి జ్యోతి, మల్లేశ్, బొజ్జ నరసింహచారి, కొలిపాక లక్ష్మి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గం విజయ

రామగుండం: వర్షాకాలం సీజన్‌లో గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, గ్రామాలకు కేటాయించిన వివిధ శాఖల అధికారులు సైతం తప్పనిసరిగా విజిట్ చేసి గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీపీ దుర్గం విజయ కోరారు. ఆదివారం అంతర్గాం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ఐదెకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి రైతులు సహకరించేందుకు వారికి అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ఉన్న బెల్ట్ షాపులను తొలగించాలని పలువురు ప్రజాప్రతినిధులు ఎక్సైజ్ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. జెడ్పీటీసీ ఆముల నారాయణ, వైస్‌ఎంపీపీ మట్ట లక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు గౌస్‌పాషా, ఎంపీడీవో ఎం.ఏ.అలీం, సూపరింటెండెంట్ మామిడాల కరుణాకర్, వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్

ఎలిగేడు: రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేసేందుకు రైతుభరోసా చేపట్టనుందని ధూళికట్ట పీఏసీఎస్ చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు అన్నారు. ధూళికట్ట సహకార సంఘం ఆధ్వర్యంలో చైర్మన్ వేణుగోపాల్‌రావు అధ్యక్షతన ఆదివారం ధూళికట్ట రైతువేదికలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వసభ్య సమావేశం జరిగింది. రైతుభరోసాపై రైతుల అభిప్రాయాలు తెలపాలని కోరగా రైతులు వారి, వారి అభిప్రాయాలను సమావేశంలో వెల్లడించారు. రైతుల అభిప్రాయాలను అధికారులు నమోదు చేసుకుని వివరాలను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆదిరెడ్డి తెలిపారు. మానిటరింగ్ అధికారి ఎండీ.ఇమ్రాన్, ఏఈవో పద్మ, సింగిల్‌విండో సీఈవో బద్దం రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు పోల్సాని పుల్లారావు, భూసారపు రాజయ్య, కాల్వ అయిలయ్య, కొమ్మ భూమయ్య, బత్తిని లచ్చయ్య, రేవెల్లి సమ్మయ్య పాల్గొన్నారు.

రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న చైర్మన్ బలరాంరెడ్డి

ధర్మారం: మండలంలోని నందిమేడారం రైతువేదికలో రైతుభరోసా పథకంపై ఆదివారం రైతుల అభిప్రాయ సేకరణ నిర్వహించారు. సింగిల్‌విండో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆదిరెడ్డి హాజరయ్యారు. 67మంది రైతులు 5ఎకరాల లోపు వారికి రైతుభరోసా ఇవ్వాలని పేర్కొనగా నలుగురు రైతులు ప్రభుత్వ భూములకు ఇవ్వాలని, కౌలు రైతులకు ఇవ్వాలని ఇద్దరు, ఆదాయ పన్ను చెల్లించిన వారికి సైతం ఇవ్వాలని ముగ్గురు, 5 ఎకరాల భూమి ఉండి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారికి ఇవ్వరాదని తమ అభిప్రాయాలు రాతపూర్వకంగా ఇచ్చారు. సహకార సంఘం మానిటరింగ్ అధికారి సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి పూర్ణిమ, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సామంతుల రాజమల్లు, డైరెక్టర్లు భరత్ స్వామి, మోర కొమురయ్య, పాలమాకుల తిరుపతిరెడ్డి, ఇస్లావత్ రూపనాయక్, సహకార సంఘం సభ్యులు, ఏఈవోలు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



శ్రీధర్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

జూలపల్లి: మండల కేంద్రంలోని మున్నూరుకాపు సంక్షేమ సంఘం భవనంలో సంఘ సమావేశం మండల అధ్యక్షుడు నాడెం మల్లయ్య, జిల్లా కార్యదర్శి కొప్పుల మహేశ్ ఆధ్వర్యంలో జరిగింది. హాజరైన సభ్యుల సమక్షంలో జూలపల్లి సంఘం కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా నాడెం శ్రీధర్, గౌరవాధ్యక్షుడిగా గుమ్మడి శంకరయ్య, ఉపాధ్యక్షులుగా కటుకం నర్సయ్య, బండి రాజయ్య, ప్రధాన కార్యదర్శులుగా కటుకం మల్లయ్య, బండి స్వామి, కోశాధికారిగా ఐల కిషన్, కార్యవర్గ సభ్యులుగా ఖమ్మం సతీశ్, పెంచాల మల్లయ్య, ఐల రాజయ్య, కామల్ల లచ్చయ్య, సాన నర్సయ్య, గుమ్మడి మల్లయ్య ఎన్నియ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన పాలకవర్గాన్ని సభ్యులు సన్మానించారు.

లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డి



రామకృష్ణారెడ్డితో లయన్స్ క్లబ్ సభ్యులు

కమాన్‌పూర్: లయన్స్ క్లబ్ మండల నూతన అధ్యక్షుడిగా జూలపల్లికి చెందిన సానా రామకృష్ణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ కమాన్‌పూర్ రెండో ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా రామకృష్ణారెడ్డి గార్డెన్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌స్టాలేషన్ అధికారి సింహరాజు కోదండరాం హాజరై నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నల్లవెల్లి శంకర్, కోశాధికారిగా డా.పి.విజయ్ కుమార్‌తో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఇండక్షన్ ఆఫీసర్ వేల్పూరి సంపత్‌రావు, బండ బాబురావు, ఊట్ల అశోక్, గుంత వినోద్, లయన్స్ క్లబ్ సభ్యులు ఇనుగంటి భాఆస్కర్‌రావు, కోలేటి మారుతి, బొజ్జ రాజసాగర్, లింగమూర్తి, శరత్ కుమార్, లక్ష్మీరాజం, నారగోని సతీశ్ పాల్గొన్నారు.

సింగరేణి స్థలంలో విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న కౌశిక హరి, కార్పొరేటర్ లత

రామగుండం: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వేలాది ఎకరాల సింగరేణి భూములు ఉండగా జెన్‌కో స్థలాలలో సింగరేణి సంస్థతో విద్యుత్ కేంద్రం స్థాపించడం సరికాదని, వారి స్థలంలోనే మరో కేంద్రం ఏర్పాటు చేయాలని కేశోరాం సిమెంట్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కౌశిక హరి అన్నారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగరేణి గనుల వేలం విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని తప్పుబడుతున్న రాష్ట్ర ప్రభుత్వం అదే సింగరేణి సంస్థకు రామగుండం విద్యుత్ కేంద్రం స్థాపించేందుకు వత్తాసు పలకడం ఏంటని ప్రశ్నించారు. రామునిగుండాల కొండను అడ్వెంచర్ టూరిజంగా అభివృద్ధి చేయాలని, ఈఎస్ఐ ఆస్పత్రి స్థలంలో బహుళ అంతస్తులతో వంద పడకల ఆస్పత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో శిథిలావస్థకు చేరి కూలిపోయిన సింగరేణి క్వార్టర్లను తొలగించి సదరు స్థలంలో సింగరేణి సంస్థతో కుటీర పరిశ్రమ స్థాపించాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు ముదాం శ్రీనివాస్, కౌశిక లత, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

దారి మైసమ్మకు ప్రత్యేక పూజలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట గ్రామంలోని మూలమలుపు వద్దనున్న దారిమైసమ్మకు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాములపల్లిలో ట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దారిమైసమ్మకు పూజలు చేశారు. ఆటోడ్రైవర్లు లక్ష్మన్, శ్రీనివాస్, పర్శరాములు, అనిల్ పాల్గొన్నారు.